క్లుప్తంగా

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం



తోట్లవల్లూరు: తోట్లవల్లూరులోని శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. రాత్రి 10 గంటలకు ఆలయ కల్యాణ మండపంలో కొలువైన శివపార్వతులకు ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో కల్యాణం జరిపించారు. లింగోద్భవ సమయాన అఘోర పాశుపతాభిషేకములు నిర్వహించారు. అనంతరం నంది వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం జరిగింది. ఆలయ ఈఓ హరి దుర్గా నాగేశ్వరరావు ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వైభవంగా శివ పార్వతుల గ్రామోత్సవం



పామర్రు: స్థానిక సోమేశ్వరస్వామి వారి దేవస్థానంలోని శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను గురువారం గ్రామంలో అంగరంగ వైభవంగా ఊరేగించి గ్రామోత్సవం నిర్వహించారు. ఇంటింటికీ ఆపి ఆది దంపతులకు కొబ్బరి కాయలు నీరాజన హారతులను ఇచ్చారు. ఆలయ అర్చకులు లంకా భీష్మకుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు.

ఘనంగా రామేశ్వరస్వామి కల్యాణోత్సవం



తోట్లవల్లూరు: ఐలూరులోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీరామేశ్వర స్వామి కల్యాణోత్సవం బుధవారం రాత్రి కనులపండువలా జరిగింది. ఆలయ కల్యాణ వేదికపై కొలువైన స్వామి వారి ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు ఘనంగా కల్యాణం జరిపించారు. స్వామి వారి రథోత్సవం గురువారం రాత్రి వేడుకగా సాగింది. శివరాత్రి పురస్కరించుకుని రామేశ్వరస్వామి ఆలయంలో హుండీల ద్వారా రూ.2.49 లక్షలు, రఘునాయకస్వామి ఆలయంలో రూ.32 వేలు ఆదాయం లభించినట్లు ఆలయ మేనేజర్ శివగోపాలరావు తెలియజేశారు.

వ్య.కా.స. జిల్లా అధ్యక్షుడు శీలం ప్రకాశరావు మృతి



మొవ్వ: సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం ప్రకాశరావు గురువారం సాయంత్రం గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రకాశరావు మరణం పట్ల సీపీఎం మొవ్వ మండల కార్యదర్శి శీలం నారాయణరావు తదితరులు సంతాపాన్ని తెలియజేశారు. ప్రకాశరావు భౌతిక కాయానికి శుక్రవారం ఉదయం 10 గంటలకు మొవ్వ గ్రామంలోని జేజే నగర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

అంగలూరులో పట్టుబడిన 22 మద్యం సీసాలు



గుడ్లవల్లేరు: కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలను పురస్కరించుకుని మద్యం దుకాణాలను రెండు రోజుల పాటు మూసివేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. కాని గురువారం అంగలూరులో మద్యం విక్రయాలు జరిగాయి. మద్యం విక్రయిస్తున్న షేక్ బాజీ బాబు అనే వ్యక్తి మద్యం సీసాలతో పట్టుబడ్డాడు. మొత్తం 22 మద్యం సీసాలు నిందితుడి వద్ద పట్టుబడ్డాయని గుడివాడ ఎక్సైజ్ సీఐ పి.వెంకట రమణ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేస్తున్నామని సీఐ చెప్పారు.

మహిమాన్వితురాలు మరియమ్మ తల్లి

కలిదిండిలో రేపటి నుంచి మరియమాత ఉత్సవాలు ప్రారంభం

కైకలూరు: మానవ రక్షణకు మహోన్నత కుమారుడిని విశ్వానికి అందించిన మాతృమూర్తి మరియమాత ఉత్సవాలు కలిదిండి విచారణ చర్చిలో శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు సమీప జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు హాజరవుతారు. సమష్టి దివ్య పూజా బలి, జపమాల, నృత్య ప్రదర్శనలు, పాటలు, ఏసు ప్రభువు గొప్పతనాన్ని చాటే నాటకాలు ప్రదర్శించనున్నారు. మరియ తల్లి ప్రార్థనా సహాయంతో కుమారుడైన క్రీస్తు ద్వారా ఆయురారోగ్య మహాభాగ్యాలు, మనోవాంఛ ఫలాలు పరిపూర్ణంగా పొందుతాయని ఈ ప్రాంత ప్రజల నమ్మకం. కలిదిండి విచారణ కర్త బంటుమిల్లి యోహాను ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మండవల్లి మండలం భైరవపట్నం విచారణ నుంచి 1961లో కలిదిండి విచారణను ప్రారంభించారు. దీనికి మచిలీపట్నం వెన్ననపూడి విచారణ కృషి చేసింది. తర్వాత కలిదిండి విచారణ నుంచి కోరుకొల్లు, కైకలూరు, ఇటీవల భాస్కరరావుపేట విచారణలు ఏర్పడ్డాయి. ఫ్రాన్సిస్ వించి, సేల్సులు, జాన్ మాత్యు ఆధ్వర్యంలో కలిదిండిలో పునీత జోజప్ప దేవాలయం, ఆసుపత్రి, మత స్త్రీలకు గృహం, కల్వరి కొండను నిర్మించారు. 1977లో ఈ ప్రాంతంలో తుపాను వచ్చినప్పుడు ఇక్కడ కోలకాని మరియన్న విచారణ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. కలిదిండి విచారణ తరపున మరియదళం, విన్సెంట్ ద పాల్ సొసైటీ, సెయింట్ జోషప్స్ యూత్, దోమినిక సావియా వత్తాసు బాలల సంఘంద్వారా సామాజిక సేవలు అందిస్తున్నారు.

విచారణ గ్రామాలు

కలిదిండి విచారణ చర్చి పరిధిలో మద్వానిగూడెం, గుర్వాయిపాలెం, లోడిదిలంక, కొండంగి, బరింకలగరువు, కొండూరు, యడవల్లి, లక్ష్మీపురం, మిలటరీపేట, మరియ రుద్రవరం, నెహ్రూనగర్, తాడినాడ, సానా రుద్రవరం, పేట కలిదిండి, గొల్లగూడెం ఉన్నాయి. ఇక సంస్థల విషయానికి వస్తే సెయింట్ మేరీస్ ఇంగ్లిషు మీడియం స్కూల్, మిషనరీస్ ఆఫ్ మదర్ మేరీ కాన్వెంట్, మద్వానిగూడెం ఆర్‌సీఎం ప్రాథమిక పాఠశాల ఉన్నాయి.

సాంస్కృతిక కార్యక్రమాలు ఇలా...

మార్చి 1వ తేదీ శనివారం మరియమాత స్వరూపంతో ఊరేగింపు, కైకలూరు విచారణకర్త గంటా ప్రవీణ్ నిర్వహణలో పాటలు, భక్తులకు అన్నదానం. 2వ తేదీన కోరుకొల్లు విచారణ కర్త గూడపాటి ప్రతాప్ నిర్వహణలో పాటలు, కొవ్వూరు హార్ట్ బీట్ క్రిస్టియన్ ఆర్కెస్ట్రాతో గీతాలాపన, 3వ తేదీన భాస్కరరావుపేట విచారణ కర్త టోమి జోసెఫ్ ఆధ్వర్యంలో సమష్టి దివ్య పూజాబలి, అనంతరం పీఠాధిపతులకు సన్మానం. పలు నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారు.



కలిదిండిలో మరియమాత విచారణ చర్చి



కల్వరికొండ మీద సిలువపై ఏసుప్రభువు విగ్రహం

మహిమాన్విత తల్లి



కలిదిండి మరియమాత తల్లి ఎంతో మహిమాన్వితురాలు. అమ్మ వద్ద ప్రశాంత మనసుతో ప్రార్థన చేస్తే కష్టాలు తొలగుతాయని నమ్మకం ఉంది. ప్రతి ఏటా మూడు రోజులు మరియమాత మహోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి అమ్మ భక్తులు విచ్చేస్తారు. మరియమాత దర్శనం గొప్ప అనుభూతిని అందిస్తుంది.

– వట్టిపల్లి ప్రభాకర్, కలిదిండి, మిలటరీపేట

మత సామరస్యానికి ప్రతీక



కలిదిండి మరియమాత ఉత్సవాలకు క్రైస్తవులతో పాటు అన్ని మతాల వారు వస్తుంటారు. ఇతర మతస్తులు మరియమ్మకు భక్తితో కానుకలు సమర్పిస్తారు. కలిదిండి విచారణ చర్చి నుంచి అనేక సేవా కార్యక్రమాలను చేస్తున్నారు. భక్తులకు భోజన వసతి కల్పిస్తున్నారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

– ఎస్.ఆనందకుమార్, కలిదిండి

విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుడివాడ టౌన్: రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జ్ పనులలో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ కాలనీ, లక్ష్మీనగర్, చౌదరిపేట, బ్యాంక్ కాలనీలలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించవలసిందిగా కోరారు.

వెలమపేట డ్రెయినేజీ సమస్య పరిష్కారం

మండవల్లి: మండవల్లిలోని వెలమపేట డ్రెయినేజీ సమస్యలను సర్పంచ్ మెండా ఝాన్సీ పరిష్కరించారు. గతంలో ఇక్కడ డ్రెయినేజీ సక్రమంగా లేక రోడ్డుపై మురుగు నీరు నిలిచి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రహదారిపై తూములు ఏర్పాటు చేసి రహదారి సమస్యను పరిష్కరించినట్లు సర్పంచ్ తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అక్రమాలు

మండవల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ కూటమి అక్రమాలు, డబ్బుల పంపిణీ, శిబిరాల పేరుతో జాతర, ఎన్నికల నియమాలకు పాతర వేసిందని కార్మిక ప్రజా సంఘాల నాయకులు గురువారం విమర్శించారు. మండవల్లిలో పోలింగ్ అనంతరం నిర్వహించిన ప్రజా సంఘాల నాయకుల సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి మండలాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద కూటమి నాయకులు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసి ప్రలోభాలకు గురి చేశారన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. స్థానిక జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లలో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. మొత్తం 1312 ఓట్లకు గానూ 923 ఓట్లు పోలయ్యాయి. బూత్ నంబరు 145లో 312 మంది పురుషులు, 216 మంది మహిళలు, 146లో 232 మంది పురుషులు, 163 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 70 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ కుసుమకుమారి తెలియజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ ఆధ్వర్యంలో పమిడిముక్కల సీఐ చిట్టిబాబు, ఎస్ఐ అవినాష్ బందోబస్తు నిర్వహించారు.

గుడ్లవల్లేరులో 72 శాతం పోలింగ్

గుడ్లవల్లేరు: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. గుడ్లవల్లేరు మండలంలో 1,481 ఓట్లకు గానూ 1,073 ఓట్లు పోలయి 72 శాతం నమోదయినట్లు తహసీల్దార్ బి.లోకరాజు తెలిపారు. ఓట్లు వేసేందుకు పట్టభద్రుల ఓటర్లు ఉదయం నుంచే బారులు తీరారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో 69.65 శాతం పోలింగ్

గుడివాడ టౌన్: ఉమ్మడి కృష్ణా – గుంటూరు పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలు గురువారం నియోజకవర్గంలో ప్రశాంతంగా జరిగాయి. స్థానిక ఎస్‌పీఎస్ మున్సిపల్ హైస్కూల్, ఏజీకే మున్సిపల్ హైస్కూల్‌లలో పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశారు. ఏజీకే హైస్కూల్‌లో 3, ఎస్‌పీఎస్ హైస్కూల్‌లో 7 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఓటర్లకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. గుడివాడ నియోజకవర్గానికి సంబంధించి నందివాడ మండలంలో మొత్తం 823 ఓట్లకు గాను 665 ఓట్లు పోల్ కాగా గుడివాడ పట్టణంలో 7,865 ఓట్లకు గాను 5,314, గుడ్లవల్లేరు మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలలో మొత్తం 1,481 ఓట్లకు గాను 1,073 ఓట్లు పోలయినట్లు అధికారులు తెలిపారు. గుడివాడ నియోజకవర్గంలో సగటున 69.65 శాతం ఓట్లు పోలయినట్లు అధికారులు పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియను ఆర్డీఓ జి.బాల సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఇతర అధికారులు పర్యవేక్షించారు.

పెదపారుపూడిలో 68.33 శాతం పోలింగ్

పెదపారుపూడి: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో 68.33 శాతం ఓట్లు పోలైనట్లు తహసీల్దార్ వై.రంగారావు తెలిపారు. మండలంలో మొత్తం 823 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా వీరిలో 564 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. పురుషులు 343 మంది, మహిళలు 221 మంది ఓట్లు వేశారన్నారు.

పామర్రులో 73 శాతం పోలింగ్

పామర్రు: పామర్రులో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 4 గంటలతో ముగిసింది. మండల పరిధిలో మొత్తం గ్రాడ్యుయేట్ ఓటర్లు 1766 మంది ఉండగా వీరిలో 1305 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీనితో 73 శాతం పోలింగ్ అయినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రంలో పామర్రు మాజీ ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తండ్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద కూటమి అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినట్టు సమాచారం. పోలింగ్ కేంద్రంలో టీడీపీ నాయకులు పసుపు రంగు చొక్కాలు ధరించి వచ్చి పోలింగ్ కేంద్రంలో హల్‌చల్ చేస్తున్నా అటు పోలీసులు కాని, ఎన్నికల అధికారులు కాని ఎవరూ నోరు మెదపక పోవడంతో స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మొవ్వ మండలంలో 70 శాతం పోలింగ్

మొవ్వ: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు పోలింగ్ గురువారం మండలంలో ప్రశాంత వాతావరణంలో జరిగింది. మొత్తం 1259 మంది ఓటర్లకు గాను పోలింగ్ ముగిసే సమయానికి 882 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా పోలింగ్ శాతం 70.05 గా నమోదయింది. ఉదయం మందగొండిగా సాగినా మధ్యాహ్నానికి ఊపు అందుకుంది. పోలింగ్ కేంద్రాలను గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ పరిశీలించారు. కూచిపూడి ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ కె.మస్తాన్ పర్యవేక్షణలో కొనసాగిన ఈ ఎన్నికలకు పీవోలుగా మొవ్వ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎస్.శ్యామల, మండల వ్యవసాయాధికారి కె.శివప్రసాద్ వ్యవహరించారు.

పమిడిముక్కలలో 74 శాతం పోలింగ్

పమిడిముక్కల: పమిడిముక్కలలో గురువారం ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. మండలంలో 74 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 1287 ఓట్లకు గానూ 954 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పమిడిముక్కల జెడ్పీ పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లలో పోలింగ్ ప్రక్రియ సాగింది. ఎన్నిక ప్రక్రియను తహసీల్దార్ నవీన్ కుమార్, ఎస్ఐ బి.శ్రీను పర్యవేక్షించారు.



ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



వృద్ధుడిని ఓటు వేసేందుకు వీల్ చైర్‌లో తీసుకొచ్చిన రెవెన్యూ బృందంతో తహసీల్దార్ లోకరాజు



గుడ్లవల్లేరులో పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు



పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న అధికారులు



మొవ్వలో పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న గుడివాడ డీఎస్పీ ధీరజ్

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ గంగాధరరావు

పామర్రు: పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. నియోజకవర్గ కేంద్రమైన పామర్రు జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అక్కడ ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఓటర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఏవిధమైన అసౌకర్యాలు లేకుండా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ నిబంధనలు ఉన్నాయని అన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉత్పన్నమైనా వెంటనే స్థానిక పోలీసులను సంప్రదించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీ నేతలు అందరూ తమతో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పామర్రు సీఐ సుభాకర్, ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పామర్రు పోలింగ్ స్టేషన్‌లో ఓటర్లతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గంగాధరరావు

నిలకడ లేని పిల్లెట్స్ మార్కెట్‌తో ఇబ్బందులు

మండవల్లి: నిలకడ లేని పిల్లెట్స్ మార్కెట్‌తో ఫంగస్ పెంపకందార్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిల్లెట్స్‌లో వాడే అన్ని పరికరాల ధరలు తగ్గినా వీటిని మాత్రం మొక్కుబడిగా రూ.1 తగ్గించడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో డీఓబీ ధర కేజీ రూ.18 నుంచి రూ.20 వరకు ఉండేది. అది ప్రస్తుతం రూ.11, 12కు వస్తుంది. గతంలో చెక్క ధర 70 కేజీలు రూ.3 వేలు రేటు పడేది. ప్రస్తుతం రూ.2800కు విక్రయిస్తున్నారు. పచ్చి తవుడు లోగడ కేజీ రూ.28, రూ.30 ధర ఉండేది. ప్రస్తుతం రూ.20, 21కు విక్రయిస్తున్నారు. 24 రకం 4 ఎంఎం పిల్లెట్స్ గతంలో కేజీ ధర రూ.36–50 ఉండేది. ఇప్పుడు రూ.34–50కు విక్రయిస్తున్నారు. 28 రకం పిల్లెట్స్ లోగడ 40 కేజీల బస్తా కేజీ రూ.39 ఉండగా ప్రస్తుతం రూ.38కి విక్రయిస్తున్నారు. పిల్లెట్స్‌కు వాడే ధరలు తగ్గినా మొక్కుబడిగా కేజీకి రూ.1 తగ్గించడం పట్ల ఫంగస్ లబ్ధిదారులు, రొయ్యల చెరువుల లబ్ధిదారులు తీవ్ర నిరసన తెలియజేస్తున్నారు. ఫంగస్ పెంచే వారు ఇప్పటికే 60 శాతం మంది తగ్గారు. కేవలం 40 శాతం వరకే సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలకు చాలా మంది సాగు నిలుపుదల చేయడానికే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తుంది. కనీసం పిల్లెట్స్ ధరలో కేజీకి రూ.4 నుంచి రూ.5 వరకు తగ్గించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పిల్లెట్స్

పిల్లెట్స్ ధర కేజీకి రూ.4 నుంచి 5 తగ్గించాలి



డీఓబీతో సహా పిల్లెట్స్‌లో వాడే అన్ని ధరలు తగ్గినా పిల్లెట్స్ ధర మాత్రం తగ్గించడం లేదు. కేవలం కేజీకి మొక్కుబడిగా రూ.1 తగ్గించారు. కనీసం కేజీకి రూ.4, 5 తగ్గే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే ఫంగస్ సాగుదార్లు 60 శాతం తగ్గారు. ధరలు ఇదే విధంగా ఉంటే మిగిలిన 40 శాతంలో పలువురు నిలిపి వేయడానికి చూస్తున్నారు.

–దూసనపూడి నాంచారయ్య, రైతు, మండవల్లి

రేపు పరమహంస జయంతి

కైకలూరు: భగవాన్ రామకృష్ణ పరమహంస 190వ జయంతి సందర్భంగా కైకలూరు ఎన్జీవోస్ కాలనీలోని రామకృష్ణ సేవా సమితి మందిరంలో మార్చి 1న జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు భూపతిరాజు వేంకటేశ్వర వర్మ గురువారం చెప్పారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని దైవనామ సంకీర్తన, విష్ణు సహస్రనామ పారాయణం, రామకృష్ణ పరమ హంస జీవిత ఘట్టాలు, కోలాటం, నృత్యాలు, ప్రసాద వినియోగం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కైకలూరులో 76 శాతం పోలింగ్



ముదినేపల్లిలో ఓట్లు వేయడానికి క్యూలో ఉన్న పట్టభద్రులు



కైకలూరు ఓరియంటల్ స్కూల్ బూత్ వద్ద బారులు తీరిన పట్టభద్రుల ఓటర్లు



వేలిపై సిరా గుర్తు చూపుతున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు కైకలూరు నియోజకవర్గంలో గురువారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. నియోజకవర్గంలో కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో కైకలూరులో మూడు, మిగిలిన మండలాల్లో రెండు చొప్పున పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశారు. నియోజకవర్గం మొత్తం ఓటర్లు 6447 మంది ఉన్నారు. వారిలో ఓటు హక్కును 4967 మంది వినియోగించుకున్నారు. మొత్తంమీద నియోజకవర్గంలో 76 శాతం ఓటింగ్ నమోదైంది. కైకలూరు మండలంలో 2,296 మంది ఓటర్లకు గాను 1,664 మంది, కలిదిండి మండలంలో 1,633 మంది ఉండగా 1359 మంది, మండవల్లి మండలంలో 1,122 మందికి గాను 862 మంది, ముదినేపల్లి మండలంలో 1,396 మందికి గాను 1,082 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కైకలూరులో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పీడీఎఫ్ ఉపాధ్యాయులకు, కూటమి నేతలకు ప్రచారం విషయంలో స్వల్ప వివాదం రేగింది. టౌన్ సీఐ పి.కృష్ణ జోక్యంతో చివరకు సద్దుమణిగింది. కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్, పట్టణ సీఐ పి.కృష్ణ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా మండలాల్లో తహసీల్దార్లు పోలింగ్ సరళిని పర్యవేక్షించారు.